క్లుప్తంగా

ఘనంగా పైడితల్లమ్మ పండగ



పైడితల్లమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

గజపతినగరం: మండల కేంద్రంలో గ్రామ దేవత పైడితల్లమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గజపతినగరం గ్రామస్తులతో పాటు పంచాయతీ మధుర గ్రామాలైన ఎస్.జి.ఆర్.పురం,ఎం.వెంకటాపురం గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీర, రవికలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పెద్దలు కందుల చిన్నయ్యస్వామితో పాటు ఆలయకమిటీ బృందం అన్ని ఏర్పాట్లు చేసింది.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం



ఆలయ ట్రస్టు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత సురేష్

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి లావేరురోడ్‌లో ఉంటున్న కొత్త సురేష్ కుటుంబ సభ్యులు రూ.50 వేల ఆర్థిక సహాయం చేశారు. మంగళవారం ఆయన తన నివాసంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కుమార్ ధనూకా, ఒమ్మి రమేష్, గొల్లస్వామి, గుడ్ల శ్రీను తదితరులకు మంగళవారం నగదు అందజేశారు. ఆలయ ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ అయ్యప్ప ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గుర్ల: విద్యార్థులు చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ భాస్కరరావు సూచించారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు బానిసగా మారితే ఆరోగ్యంతో పాటు జీవితం నాశనం అవుతుందని అన్నారు. విద్యార్థులు, యువత అవగాహన లోపంతో చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారని, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం చాలా ప్రమాదకరమని చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల, భవిత కేంద్రం సందర్శన



ఎస్.కోట ప్రాథమిక పాఠశాల-1లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమకుమార్

శృంగవరపుకోట: స్థానిక భవిత కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాల -1ను డీఈఓ ప్రేమ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లల హాజరు రికార్డులు పరిశీలించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలని, అలాగే ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ తదితర సేవలు అందేలా చూడాలని ఐఈఆర్టీలకు సూచించారు.ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు.అలాగే మండల విద్యావనరుల కేంద్రంలో తనిఖీలు చేశారు. ఆయన వెంట ఎంఈఓలు ఉన్నారు.

మోడ్రన్ కిచెన్ సెంటర్



కిచెన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాబార్డ్ సీజీఎం గోపాల్

విజయనగరం అర్బన్: టీటీడీసీ ప్రాంగణంలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సేటీ ఉచిత శిక్షణా కేంద్రంలో వసతి అభ్యర్థుల సౌకర్యార్థం మోడ్రన్ కిచెన్ సెంటర్‌ను నాబార్డ్ అమరావతి సర్కిల్ సీజీఎం ఎంఆర్ గోపాల్ మంగళవారం ప్రారంభించారు. నాబార్డు ఆర్థిక సహాయంతో శిక్షణా కేంద్రానికి అవసరమైన వివిధ సామగ్రిని అందజేసారు. ఇందులో భాగంగా మోడ్రన్ కిచెన్ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌సేటీ డైరెక్టర్ టీబీవీ రమణ, నాబార్డ్ డీడీఎం టి.నాగార్జున, నాబార్డ్ ఏజీఎం కండల్ సింగ్, ఏఎల్‌డీఎం ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

సాగులో యాంత్రీకరణతో పెట్టుబడి ఆదా



గుర్ల: డ్రమ్ సీడర్‌తో విత్తనాలు విత్తుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



దత్తిరాజేరు: వంగరలో వరి నాట్లు వేస్తున్న మహిళలకు సూచనలుచేస్తున్న ఏఓ అనురాధ



జామి: జామిలో యంత్రంతో వరి నాట్లు వేసే విధానంపై రైతులు,వీఏఏలకు శిక్షణ ఇస్తున్న ఏడీఏ విజయ

జామి: వ్యవసాయ సాగులో యంత్రపరికరాల వినియోగంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చని, రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని కొత్తవలస డివిజన్ ఏడీఏ ఎల్.విజయ సూచించారు. జామిలో రైతులు యంత్రంతో వరి నాట్లు వేస్తున్న విధానాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు.అలాగే వీఏఏలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగు బడులు సాధించవచ్చని చెప్పారు. యంత్రాల వినియోగంతో కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. యంత్రంతో నాట్లు వేయడం, డ్రమ్ సీడర్‌తో విత్తనాలు విత్తుకోవడం వల్ల మొక్కకు మొక్కకు మధ్య సమదూరం ఉంటుందని, పంటకు గాలి బాగా తగులుతుందని, దీని వల్ల వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది దిగుబడి ఎక్కువ రావడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతకు ముందు స్థానిక రైతుసేవా కేంద్రంలో వీఏఏలతో శాఖా పరమైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఏఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్‌తో వరిసాగు మేలు

గుర్ల: డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలను నాటుకోవడం వల్ల రైతులకు అన్ని విధాలా మేలని, ఈ విధానంలో అధిక దిగుబడులు సాధించవచ్చని చీపురుపల్లి డివిజన్ ఏడీఏ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుజ్జంగివలసలో డ్రమ్‌సీడర్‌తో వరి విత్తనాలు వేసే విధానంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. కూలీల అవసరం లేకుండా డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయవచ్చని, విత్తనాలను వరుస క్రమంలో విత్తుకోవచ్చని వివరించారు. ఏఓ తిరుపతిరావు పాల్గొన్నారు.

నారు చివర్లు తుంచి నాటుకోవాలి

దత్తిరాజేరు: వరి నారు చివర్లు తుంచి నాట్లు వేసుకోవాలని ఏఓ అనురాధ రైతులకు సూచించారు. మండలంలోని వంగర, ముద్దాన పేట గ్రామాల్లో రైతులు మంగళవారం వరినాట్లు వేస్తున్న తీరును పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. నాట్లు వేసే ముందు నీటిలో సూడోమోనస్ మందును కలిపి, ఆ ద్రావణంలో వరినారు ముంచి శుద్ధి చేయాలని సూచించారు. చివర్లు తుంచడంతో పాటు నారును శుద్ధి చేయడం వల్ల నారు ద్వారా వచ్చే తెగుళ్లను నివారించవచ్చని చెప్పారు.రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వినియోగించాలని సూచించారు.అనంతరం సర్పంచ్ నారాయణప్పలనాయుడుతో కలిసి రైతులకు ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన యంత్రాలను పరిశీలించారు.

గంజాయి రవాణపై ప్రత్యేక నిఘా



మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న సీఐ ప్రభాకరరావు

గజపతినగరం: గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని గజపతినగరం సీఐ ఎస్.వి.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సచివాలయ మహిళా పోలీసులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి రవాణాకు పాల్పడినా, గంజాయి సేవించినట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, మద్యం తాగి గొడవలు సృష్టించినా అంటువంటి వారి సమాచారం పోలీసులకు ఇవ్వాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలని వివరించారు. కోడి పందేలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపా లని దిశా నిర్దేశం చేశారు.ఎస్‌ఐ యు.మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి



ఎంఈఓ వెంకటరావుకు వినతిపత్రం అందచేస్తున్న యూటీఎఫ్ నాయకులు

దత్తిరాజేరు: జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా తీసుకువచ్చిన జీవో 117ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ సంఘ నాయకులు కోరారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ వెంకటరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.యూటీఎఫ్ నా యకులు అప్పారావు, రాంప్రసాద్, చంద్రరావు, రమేష్, మాధవీలత మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5,తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలు నడపాలని, తరగ తికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, పాఠశాలలకు రావాల్సిన గ్రాంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ



ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

శృంగవరపుకోట: జిల్లాలో సీబీఎస్‌ఈ స్కూళ్ల నుంచి ఎంపిక చేసిన 50 మంది ఉపాధ్యాయులకు మండలంలోని కిల్తంపాలెం నవోదయ పాఠశాలలో ఒక్కరోజు వృత్యంతర శిక్షణ మంగళవారం నిర్వహించారు. శిక్షణ తరగతులను డీఈఓ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ వైస్‌ప్రిన్సిపాల్ కేశవప్రసాద్, కోరుకుండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణారావు, మానస్ రంజన్‌సృష్టి తదితరులు రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. విజయనగరం ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటరమణ, బొబ్బిలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కె.మోహన్‌రావు, జిల్లా కో-ఆర్డినేటర్‌లు ఎస్.త్రినాథరావు జె.పద్మలత పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు,బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి: స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, బ్యాగులను ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం నోట్‌బుక్స్, బ్యాగులననను ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. ప్రభుత్వ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహంతో విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. అనంతరం ఆయన తోటపల్లి కాలువను పరిశీలించారు. అక్కడ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి కాలువ పురోగతిపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, టీడీపీ నాయకులు కె.త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, జనసేన నాయకుడు విజనగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



జామి: వి.ఆర్.పాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ గంగరాజు

జామి: మండలంలోని వి.ఆర్.పాలెం, వెన్నె గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈఓ-2 బి.గంగరాజు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాజరు రికార్డులు, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, వర్క్‌బుక్‌లు, మధ్యాహ్నభోజనం వంటకాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. వి.ఆర్.పాలెంలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.



గజపతినగరం: పురిటిపెంట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ-2 సాయిచక్రధర్

పురిటిపెంటలో..

గజపతినగరం: పురిటిపెంట గ్రామంలోని హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ-2 సాయిచక్రధర్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులతో పాటు విద్యార్థులకు ఉపాధ్యా యులు పాఠాలు బోధిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం వంటకాలను రుచి చూశారు. ఆయన వెంట సీఆర్పీ రామసూరిరెడ్డి ఉన్నారు.

గోవులను రక్షించాలి

విజయనగరం ఫోర్ట్: గోవులను రక్షించాలని గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. కొత్తపేట నీళ్ల ట్యాంక్ సెంటర్‌లో గల శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం కార్పొరేషన్ పరిధిలో గోవధ జరుగుతున్న అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. కబేళా నిర్వాహకులతో అధికారులు కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో కెవిఆర్.సత్యనారాయణ, మద్దిల సోంబాబు, టి.వి.శ్రీనివాసరావు, రెడ్డిపల్లి రవిశంకర్, రవికిరణ్, ఉప్పాడ పైడితల్లి, నీలాపు దేవి, గండికోటి శాంతి తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యాలు,దాడులు ఆపండి

- పరిపాలన, అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- విలేకరుల సమావేశంలోమాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో, రాష్ట్రవ్యాప్తంగా దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయని, పాలకులు అలాంటి చర్యలకు తక్షణమే స్వస్తి పలికి పరిపాలన, అభివృద్ధిపై దృష్టిసారించాలని ఎస్. కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు.మండలంలోని అర్థన్నపాలెం గ్రామ సమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విధ్వంసమే ధ్యేయంగా పాలన సాగిస్తోంద ని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు మీకు అధికారం కట్టబెట్టింది రాజకీయప్రత్యర్థులపై కక్ష తీర్చుకోవడానికి కాదని, వారికి ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పాలన చేయడానికని అన్నారు. విజయనగరం జిల్లాలో ఎప్పుడూ లేనంత స్థాయిలో ప్రస్తుతం దాడులు, అక్రమ కేసులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎంపీ శ్రీభరత్ స్పందించి, సీఎం దృష్టికి తీసుకువెళ్లి దాడులు, దౌర్జన్యాలు ఆపేలా చూడాలని కోరారు.

సూపర్-6 పథకాలు అమలు చేయాలి

ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్-6 పథకాలను కాలయాపన చేయకుండా అమలు చేయాలని కోరారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయడం తగదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాలకులు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తు న్నారే తప్ప హామీల అమలుపై దృష్టిసా రించడం లేదన్నారు. ఇసుక ఉచితంగా ఇస్తామని ప్రచారం చేసి, ఇప్పుడు టన్ను ఇసుకకు వేల రూపాయల డబ్బులు వసూలు చేయడం తగదన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద కనీస సౌకర్యాలు లేవని, వేబ్రిడ్జిలు లేకుండానే అంచనా కట్టి ఇసుక అమ్మకం చేయడం సరికాదని, పారదర్శకంగా చేప ట్టాలని సూచించారు. వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, కొత్తవలస మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, నాయకులు గొరపల్లి శివ,బొంతల వెంకటరావు, భీమాళి సర్పంచ్ కొయ్యాన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజులకు గ్లోబల్ అచీవర్స్ అవార్డు



గోవాలో అవార్డు అందుకుంటున్న గోవిందరాజులు

చీపురుపల్లి: నేత్రదానంపై అవగాహన కల్పించడంతో పాటు కార్నియా సేకరణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులకు గ్లోబల్ అచీవర్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. న్యూఢిల్లీకి చెందిన ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సామాజిక సేవా రంగంలో ఉత్తమ సేవలందించే వారిని గ్లోబల్ అచీవర్స్ ఎక్స్‌లెన్స్ అవార్డులకు ఎంపిక చేసింది. అందులో భాగంగానే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నేత్ర దానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, 300కు పైగా కార్నియాల సేకరణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గోవిందరాజులును అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 29న గోవాలో జరిగిన కార్యక్రమంలో అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన సెంట్రల్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ సురేష్‌బాబు, వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆదినారాయణ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



జామి: జామిలో పరిసరాలను పరిశీలించి ఎంపీడీఓ, ఈఓపీఆర్డీకి సూచనలు చేస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజా



కొత్తవలస: నిమ్మలపాలెంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది



మెరకముడిదాం: గర్భాంలో బ్లీచింగ్ చల్లిస్తున్న పంచాయతీ బిల్ కలెక్టర్ శ్రీనివాసరావు

జామి: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీపీఓ శ్రీధర్‌రాజా పంచాయతీ కార్యదర్శులు, అధికారులను ఆదే శించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన పర్యటించారు.పలు వీధులు, రోడ్లను, గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో రోడ్ల పక్కన ఉన్న చెత్తను తొలగించే పనులు చేపట్టాలని ఎంపీడీఓ తిరుమలరావు, ఈఓపీఆర్డీ శ్రీదేవిని ఆదేశించారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం గ్రామంలో దోమల నివారణకు పంచాయతీ అధికారులు, వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఎబేట్ మందును మంగళవారం పిచికారీ చేశారు.అలాగే పారిశుద్ధ్య పనులు చేసి, తాగునీటి వనరులల్లో క్లోరినేషన్ చేయించారు. హెల్త్ సహాయకుడు సత్యారావు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, నివాస పరిసరాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. చేపలు, గోంగూర, నిల్వ ఆహార పదార్థాలను తినకూడదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పావని,లక్ష్మి,ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నా రు.

గర్భాంలో పారిశుద్ధ్య పనులు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం గ్రామంలో రెండురోజులుగా పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలోని అన్ని వీధుల్లో, కాలువల్లో, బహిరంగ ప్రదేశా ల్లో పంచాయతీ బిల్ కలెక్టర్ శ్రీనివాసరావు పారిశుద్ధ్యకార్మికులతో మంగళవారం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

మెనూ పాటించాలి



ఆతవ పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు



బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలలో విద్యార్థినులు తయారు చేసిన ప్రాజెక్ట్‌లను తిలకిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, నాణ్యత పాటించాలని ఎంఈఓ-1 జగదీశ్వరరావు వంట నిర్వాహకులకు సూచించారు. ఆతవ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించి, నిర్వా హ కులకు పలు సూచనలు చేశారు. అలాగే బక్కునాయుడుపేటలోని కేజీబీవీ, గురుకుల బాలికల పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు సందర్శించారు. గురుకుల పాఠశాల లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థినులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్‌లను తిలకించారు. ఎంఈఓలు వెంట సీఆర్పీలు ఉన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ కమిటీ కార్యవర్గం ఎన్నిక



ఎస్.కోట నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక మండలంలోని గోల్డుస్టార్ జంక్షన్ వద్ద చర్చిలో మంగళవారం జరిగింది.

కమిటీ అధ్యక్షుడిగా ఫిలిప్ డేవిడ్, గౌరవ అధ్యక్షుడి గా బిషప్ దేవీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ధర్మవరపు డేనియల్, కార్యదర్శిగా భాస్కర్ జోషప్‌తో పాటు మరో 25 మంది కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమంలో ఐదు మండలాల్లోని చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

విజయనగరం క్రైమ్: ఇంట్లో అలిగి స్కూల్‌కి వెళ్లకుండా విజయనగరం వచ్చేసిన బాలుడు ఎట్టకేలకు వన్‌టౌన్ పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు చేరాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం బీసీ కాలనీకి చెందిన 13 ఏళ్ల గొర్లె యశ్వంత్ ఇంట్లో అలిగి తల్లిదండ్రులకు చెప్పకుండా స్కూల్‌కి వెళ్లకుండా విజయనగరం వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో తిరుగుతున్నాడు. హెడ్ కానిస్టేబుల్ రమణారావు బాలుడిని చూసి సందేహం వచ్చి వన్‌టౌన్‌కి తీసుకువచ్చి వివరాలు సేకరించారు. సీఐ సమక్షంలో తల్లిదండ్రులకు సమాచారమందించారు. తల్లిదండ్రులు వచ్చిన తర్వాత బాలుడిని అప్పగించారు. బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.